# “తెలంగాణ జానపద అకాడమీ వెంటనే ఏర్పాటు చేయాలి”

## -- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్






**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 4**

తెలంగాణ జానపద కళలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేసి, భవిష్యత్తులో తెలంగాణ జానపద విశ్వవిద్యాలయంను స్థాపించాలని సకల కళల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది.”డప్పు కొడితే తెలంగాణ వచ్చింది... ఆ డప్పు కొట్టిన చేతులకు తెలంగాణ ఏమిచ్చింది?” అనే ప్రశ్నతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు వక్తలు ప్రభుత్వాన్ని నిలదీశారు.సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆధ్యకళ వ్యవస్థాపకులు జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా జానపద కళలకు ప్రత్యేక అకాడమీ లేకపోవడం బాధాకరమన్నారు.అంతరించిపోతున్న కళారూపాలను కాపాడేందుకు చట్టబద్ధమైన వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు.ద్రావిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ పులికొండ సుబ్బాచారి మాట్లాడుతూ, జానపద కళలు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష, గిరిజన సంప్రదాయాలకు జీవనాడి అని అన్నారు.దేశంలోని ఇతర రాష్ట్రాల్లో జానపద కళల పరిరక్షణకు ప్రత్యేక అకాడమీలు, పరిశోధన సంస్థలు పనిచేస్తున్నాయని, తెలంగాణలో కూడా అలాంటి సంస్థ అత్యవసరమని సూచించారు.ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ, జానపద కళారూపాల డిజిటల్ భద్రపరచడం, కళాకారుల నమోదు, సంక్షేమం, యువతకు శిక్షణ, పరిశోధన, మ్యూజియంల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు జానపద అకాడమీ కేంద్రంగా నిలుస్తుందని వివరించారు.సకల కళల జేఏసీ నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, సాదు మహారాజు రఘోత్తమ చార్యులు మాట్లాడుతూ, “జానపద అకాడమీ మా హక్కు -- భిక్షం కాదు” అని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం పాట పాడిన కళాకారులను ప్రభుత్వం మరవకూడదని, వెంటనే జానపద అకాడమీ ఏర్పాటు చేసి జానపద విశ్వవిద్యాలయం స్థాపనకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కోరారు.వలస సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంకె రాజేష్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, నడిమింటి శ్రీనివాస్, కొమురయ్య, దేవేందర్ రావు, పెద్దపల్లి నరసయ్య, దంతాలపల్లి సోమయ్య, జంగిలి లచ్చన్న, శ్రీశైలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.సమావేశంలో జానపద అకాడమీ ఏర్పాటు, జానపద విశ్వవిద్యాలయం స్థాపనకు సంబంధించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

# అసంపూర్తి సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

## : వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (తెలుగు గళం న్యూస్)**



యాదాద్రి--వరంగల్ మధ్య జాతీయ రహదారి-163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య డిమాండ్ చేశారు.మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేసి ఈ సమస్యపై చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, హైదరాబాద్--భూపాలపట్నం జాతీయ రహదారి-163లో యాదాద్రి నుంచి వరంగల్ వరకు నాలుగు లేన్ల విస్తరణ పనుల సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య అనుసంధాన లింకులు పూర్తి కాలేదని తెలిపారు.జనగామ సమీపంలోని 87/200 కిలోమీటర్ నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి వరకు, రఘునాథపల్లి నుంచి చాగల్ వరకు, చాగల్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాల వరకు, చిన్నపెండ్యాల నుంచి కరుణాపురం వరకు సర్వీస్ రోడ్లలో లింకులు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ఈ పరిస్థితి కారణంగా స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాల ప్రమాదం కూడా అధికమవుతోందని ఎంపీ పేర్కొన్నారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన సర్వీస్ రోడ్ల లింకుల నిర్మాణాన్ని వెంటనే చేపట్టేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని తెలిపారు.ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌకర్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానం దృష్ట్యా అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ డా. కడియం కావ్య వెల్లడించారు.

# ఆగస్టు 10 ‘జైల్ భరో’ను విజయవంతం చేయాలి

## -- కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు





**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 4**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే “జైల్ భరో” కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది.హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ల అమలు, విద్యుత్ సవరణ బిల్లు--2025, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం, విత్తన చట్ట సవరణలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మిక చట్టాల సడలింపులు, పని గంటలను పెంచే విధానాలు కార్మికుల హక్కులకు విరుద్ధమని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు.క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించే జైల్ భరోలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్రాజ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం, ఐఎఫ్‌టీయూ నాయకులు శివబాబు, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఏఐయూటీయూసీ నాయకుడు భరత్, ఐఎఫ్‌టీయూ నాయకుడు విశ్వనాథ్ తదితరులు మాట్లాడి తీర్మానానికి మద్దతు తెలిపారు.నాన్ షెడ్యూల్డ్ ఉద్యోగులకు ఇప్పటికీ కనీస వేతనాలు నిర్ణయించకపోవడం అన్యాయమని నాయకులు పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. రావు, కె. ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, కూరపాటి రమేష్, పి. శ్రీకాంత్, కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సోమన్న, రొయ్యల రాజు, జె. మల్లికార్జున్, బీఆర్టీయూ నాయకులు ధానకర్ణచారి తదితరులు పాల్గొన్నారు. చివరగా సీఐటీయూ హైదరాబాద్ సిటీ కార్యదర్శి కుమారస్వామి వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

# ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేయండి

## సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు పిలుపు




**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 4**

ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు పిలుపునిచ్చారు.మంగళవారం స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు కత్తుల రాజు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల బాధ్యులు పోలాసు కిష్టయ్య, సీఐటీయూ నాయకుడు లింగనబోయిన శ్రీకాంత్ అధ్యక్షత వహించారు.రాపర్తి రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తోందని ఆరోపించారు. అమెరికా నుంచి మక్కజొన్న, పత్తి, పాలు, చేపలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను సుంకం లేకుండా దిగుమతి చేసుకునే నిర్ణయం దేశ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శించారు.దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక నియమావళులను తీసుకురావడం కార్మిక హక్కులపై దాడి అని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ కొత్త పథకాలను ప్రవేశపెట్టడం గ్రామీణ పేదల జీవనోపాధిపై దెబ్బ అని అన్నారు.దేశ సంపద, గనులు, అడవులు, సహజ వనరులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడమే కాకుండా విద్యుత్ రంగాన్ని కూడా ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ రంగంలో కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లు, మూడో విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు వంటి చర్యలను వ్యతిరేకించారు.కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాపాడుకోవాలంటే ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో జిల్లా, మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రాపర్తి సోమయ్య, భూక్య చందు నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి లింగబోయిన కుమార్, కేవీపీఎస్ మండల కార్యదర్శి మంద మహేందర్, ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, యారా మోహన్, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, పోలాసు పరమేష్, బోయిని రాజయ్య, తాటికొండ ఉప్పలయ్య, వంగపండ్ల సోమయ్య, దైద కుమార్, పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తాడి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

## కొడవటంచలో ఘటన --చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**



మండలంలోని కొడవటంచ గ్రామంలో తాడి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు.గ్రామానికి చెందిన మూల చంద్రమౌళి జీవనోపాధి కోసం తాడి చెట్లు ఎక్కి కల్లు గీస్తుండగా కాలు జారి చెట్టు పై నుంచి కిందపడినట్లు స్థానికులు తెలిపారు.గాయపడిన చంద్రమౌళిని గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌లో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా,ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు.నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రమౌళికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి మెరుగైన వైద్య చికిత్స కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమానికి బిఆర్ఎస్ అండ

**-- ధర్నాలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగాలి**

**ఏటూరునాగారంలో ఎస్ఎఫ్ఐ ధర్నాకు సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ నాయకులు**








**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**

ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, హాస్టల్ వసతులు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై విద్యార్థులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, కుమ్మరి చంద్రబాబు, కొండాయి చిన్ని, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు శ్రేణులు పాల్గొని విద్యార్థుల డిమాండ్లకు మద్దతు తెలిపారు.

# భూపాలపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్

**7,112 పోలీసు ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు అవకాశం**

**--పేర్ల నమోదు 15 వరకు:ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**







**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

రాష్ట్రంలో పోలీసు,ఎస్‌పీఎఫ్,జైళ్ల శాఖల్లో 7,112 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు.జిల్లాలోని పేద,గ్రామీణ,గిరిజన,మారుమూల ప్రాంతాల యువతకు పోలీసు ఉద్యోగాలు సాధించేలా అనుభవజ్ఞులైన అధ్యాపకులు,ఫిజికల్ ట్రైనర్లతో ఉచిత శిక్షణ అందించనున్నట్లు చెప్పారు.శిక్షణతో పాటు ఉచిత వసతి,తరగతి బోధన,శారీరక శిక్షణ కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు.పోలీసు ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 15వ తేదీ వరకు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని,మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.కోచింగ్ ప్రారంభ తేదీ,శిక్షణా కేంద్రం తదితర వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.క్రమశిక్షణతో శిక్షణ పొందితే పోలీసు ఉద్యోగం సాధించడం సాధ్యమని,యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# రేగొండలో మద్యపాన నిషేధానికి గ్రామ పంచాయతీ తీర్మానం

**బెల్టు షాపులు,గుడుంబా కేంద్రాల మూసివేతకు ఏకగ్రీవ నిర్ణయం**

**ఎస్సై దాసరి సుధాకర్‌కు తీర్మాన ప్రతిని అందజేసిన పాలకవర్గం**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

గ్రామ ప్రజల ఆరోగ్యం,యువత భవిష్యత్తు,గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా రేగొండ మండల కేంద్రంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించింది.సర్పంచ్ వారణాసి మౌనిక అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.గ్రామ పరిధిలో కొనసాగుతున్న బెల్టు షాపులు,గుడుంబా విక్రయ కేంద్రాలను తక్షణమే మూసివేయాలని తీర్మానంలో పేర్కొన్నారు.అక్రమ మద్యం విక్రయాలు కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు యువతను వ్యసనాల బారిన పడేలా చేస్తున్నాయని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.మద్యపాన రహిత గ్రామంగా రేగొండను తీర్చిదిద్దేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ పంచాయతీ తీర్మాన ప్రతిని రేగొండ ఎస్సై దాసరి సుధాకర్‌కు సర్పంచ్ వారణాసి మౌనిక,పంచాయతీ సభ్యులు,మహిళా సంఘాల ప్రతినిధులు అందజేశారు.గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి,బెల్టు షాపులు,గుడుంబా కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసు గస్తీని మరింత ముమ్మరం చేయాలని కోరారు.తీర్మానంలో గ్రామ పరిధిలో బెల్టు షాపులు,గుడుంబా విక్రయాలపై పూర్తి నిషేధం అమలు చేయడం,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం,మద్యపాన దుష్ప్రభావాలపై యువత,మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలను పొందుపరిచారు.ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు,ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దండ్రే రాజ్‌కుమార్,మహిళా సంఘం సీఏలు రేగూరి రజిత,మార్క సుమలత,వార్డు సభ్యులు పల్లె కల్పన,మేకల రాజు,పూజారి ప్రవళిక,మైస సురేందర్,అన్నారపు వెంకన్న,గ్రామస్తులు వారణాసి అజయ్, కూరాకుల మల్లయ్య, చిన్నాల ధనుంజయ్, కారోబార్ ముష్కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువు తొలి హక్కు
# -- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలకు మంత్రి సీతక్క శ్రీకారం

**ఏటూరునాగారంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ -- ఆరోగ్య సేవలపై మంత్రి సమీక్ష**

**శిశు ఆరోగ్యమే లక్ష్యం -- తల్లిపాలపై అవగాహన పెంచాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం**










తెలుగు గళం ఏటూరునాగారం :

ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రతి గ్రామంలో, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజలకు చేరువ చేస్తూ తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి, శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, ప్రతి తల్లి ఈ బాధ్యతను అవగాహనతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులతో కలిసి సీజనల్ వ్యాధుల నివారణ, రోగులకు అందుతున్న చికిత్స, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆసుపత్రి సౌకర్యాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఎస్‌డీసీ ప్రతాప్, బీడబ్ల్యూఓ ప్రేమలత, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్, ఆత్మ కమిటీ సభ్యుడు రఘు, స్థానిక సర్పంచ్ శ్రీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం

**-- నూతన సదరం శిబిరం, యూడీఐడీ భవనం, నాలుగు ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించిన మంత్రి సీతక్క**

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం -- ఆసుపత్రిలో రోగులను పరామర్శించిన మంత్రి సీతక్క**

**జిల్లా ఆసుపత్రిలో విస్తరించిన వైద్య సదుపాయాలు -- కలెక్టర్‌తో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క**










తెలుగు గళం ములుగు :

ములుగు జిల్లా ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంతో ములుగు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం నూతన సదరం శిబిరం, యూడీఐడీ భవనం, అలాగే అర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ విభాగాలకు సంబంధించిన నాలుగు ఆధునిక ఆపరేషన్ థియేటర్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజలకు జిల్లా స్థాయిలోనే అత్యాధునిక వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్ల ద్వారా వివిధ శస్త్రచికిత్సలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. అలాగే సదరం శిబిరం, యూడీఐడీ సేవల ద్వారా దివ్యాంగులకు అవసరమైన ధ్రువపత్రాలు, సేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల నాణ్యత, పరిశుభ్రత, మందుల లభ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి రోగికి మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి చంద్రశేఖర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఒకే కాలనీ.. ఒకే పోలింగ్ కేంద్రం అమలు" ఫలించిన వీరశీరాజు కృషి"




**ఎన్నికల సంఘం చర్యలపై బీజేపీ హర్షం"**

**జిల్లా అంతటా అమలు చేయాలని విజ్ఞప్తి"**



సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు04 (తెలుగుగళం) న్యూస్: ఒకే కుటుంబం, ఒకే కాలనీకి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదవుతున్న సమస్యను పరిష్కరించే దిశగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టడంపై నియోజకవర్గంలోని వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన బీజేపీ ఖమ్మంజిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు సోమవారం మీడియా సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు.తన విజ్ఞప్తిపై స్పందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విధానాన్ని సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు ఖమ్మంజిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేసి ఓటర్ల ఇబ్బందులు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా వీరంరాజు కోరారు.

# బిడ్డకు తల్లిపాలే అమృతం

**:ఐసీడీఎస్ సూపర్వైజర్ సరోజ**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

బిడ్డ శారీరక,మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్వైజర్ సరోజ అన్నారు.రేగొండ నాల్గవ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.బిడ్డ పుట్టిన తొలి గంటలోనే ముర్రు పాలు పట్టాలని,తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక రోగాల నుంచి రక్షిస్తాయని తెలిపారు.అనంతరం చిన్నారులకు అన్నప్రాసన,అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నామాల రజిత,సర్పంచ్ వారణాసి మౌనిక,ఏఎన్ఎం యాదలక్ష్మి,ఆశ కార్యకర్తలు,మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రామానగరంలో తల్లిపాల వారోత్సవాలు"

**పాల్గొన్న ప్రభుత్వ కళాశాల నర్సింగ్ విద్యార్థినీలు"**



సత్తుపల్లి,ఆర్ సి, ఆగస్టు04 (తెలుగు గళం) న్యూస్: సత్తుపల్లి మండల పరిధిలోని అయ్యగారిపేట సెక్టార్ సూపర్ వైజర్ యు మహాలక్ష్మి ఆధ్వర్యంలో రామానగరం గ్రామంలో, అయ్యగారిపేట 10 వ అంగన్వాడీ కేంద్రంలో,సత్తుపల్లి పట్టణంలోని 06 వ అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా సత్తుపల్లి కు చెందిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినీలు నిలిచారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పరిసరాల పరిశుభ్రత, మానసిక ప్రశాంతత లాంటి అంశాలపై చార్ట్ ల ద్వారా వివరించారు.అనంతరం అన్నప్రాసన వేడుకలు జరిగాయి. చార్ట్ లో ప్రదర్శిస్తూ వీధులలో ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో: కళాశాల ఉపాధ్యాయురాలు ఏం.త్రివేణి, అంగన్వాడీ టీచర్స్ బి.రమాదేవి, కె.అరుణ, సుజాత, సౌభాగ్యం, భారతి, సర్వేశ్వరీ, తామారు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

# కొత్తూరు రోడ్డును హైవేతో అనుసంధానం చేయాలి

**: సీపీఎం"**



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 04 (తెలుగు గళం) న్యూస్: సత్తుపల్లి పట్టణంలోని కొత్తూరు రోడ్డును జాతీయ రహదారితో అనుసంధానం చేసి, రహదారికి అడ్డుగా నిర్మించిన గోడను తొలగించాలని సీపీఎం డిమాండ్ చేసింది. దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని కోరింది.

సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, హైవేతో అనుసంధానం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అడ్డుగోడ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొలికపోగు సర్వేశ్వరరావు, జాజిరి జ్యోతి, రావుల రాజబాబు, చావ రమేష్, బండి వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# విన్నూత్న పద్ధతిలో తల్లి పాల వారోత్సవాలు"

**నార్మల్ డెలివరీ అవడానికి గర్భిణీ తో ఎక్సర్ సైజ్"**

**బ్రీతింగ్ ఎక్సర్సైజ్ ఆచరణలో చేసి చూయించిన**

**నర్సింగ్ కాలేజ్ విద్యార్థినీ"**

**అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసనలు"**




సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు04 (తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట సెక్టార్ లో గల సత్తుపల్లి 05 వ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ షేక్ రహింతునీసా ఆధ్వర్యంలో అయ్యగారిపేట 03 సెంటర్,జవహర్ నగర్ సెంటర్ ల సహకారంతో సూపర్ వైజర్ యు. మహాలక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం తల్లిపాల వారోత్సవాలు విన్నూత్న పద్ధతిలో చేశారు.ముందుగా చిన్నారులకు అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసనలు చేశారు.అనంతరం గర్భిణీలు సాధారణ అనగా సుఖ ప్రసవం కావాలంటే చేయాల్సిన ఎక్సర్సైజ్ లు గూర్చి అవగాహన కల్పించి ఓ గర్భిణితో ప్రత్యక్షంగా ఎక్సర్ సైజ్ చేసి చూయించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల బాలికలు బ్రీతింగ్ ఎక్సర్సైజ్ ఎలా చేయాలో ఆచరణలో చేసి చూయించి వారు మాట్లాడుతూ నెలలు నిండిన సమయంలో మాతా శిశువుకు జన్మనిచ్చే సందర్భంలో బ్రీతింగ్ సమస్య ఉత్పన్నం అవుతుంది కష్టం అనే మాట వైద్యులు చెబుతుంటారు దానికి కారణం ప్రతి రోజు బ్రీతింగ్ ఎక్సర్సైజ్ చేయకపోవడమే కారణమని గర్భిణీ స్త్రీలు ప్రతిరోజూ బ్రీతింగ్ ఎక్సర్సైజ్ చేస్తే కాన్పు సమయంలో అట్టి సమస్యను ఎదుర్కోకుండా ఉండొచ్చు అన్నారు. అనంతరం వార్డులో తల్లిపాల వారోత్సవాల ప్రదర్శన చేశారు.పాత పాలు వద్దు తల్లి పాలు ముద్దు అంటూ,బిడ్డకు 06 నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించండి అనారోగ్యాలు రాకుండా కాపాడుకోండి అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్స్ శ్రీపాటి స్వాతి,కమల, హెల్పర్ కనక దుర్గ,నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.